
చలంగారి రమణస్థాన్‌లో అతిథి అభ్యాగతులకు ఎంత ఆదరణో పశు పక్ష్యాదులకూ అంతే. భగవాన్ శ్రీ రమణ మహర్షి భక్తురాలు, చలం కుమార్తె సౌరిస్ రమణస్థాన్‌లో తమతో పెరిగిన బుజ్జాయి అనే దూడ గురించి చెబుతున్న కథ యిది—

స్కెచ్. **బుజ్జాయి** సౌరిస్—

# 

**ము**ందర కోనారు (కోనారు గొల్లవాడు. లక్ష్మికి అతనే పాలు పితికేవాడు) ఆవు లక్ష్మి.

అతను ఒక యాడాది దాని పాలే పోసేవాడు మాకు. దాని దూడ పాము కరిచి చచ్చిపోయింది. మళ్ళీ ఈతకి దూడపుట్టింది. దూడ పుట్టగానే అతనికి డబ్బు అవసరమై దాన్ని మాకు అమ్మేశాడు. లక్ష్మి దూడే బుజ్జాయి.



బుజ్జాయి పుట్టిన మర్నాడే మా ఇంటికి వచ్చేసింది తల్లితో సహా. దానికి కోనారు తల్లి దగ్గర పాలు ఉంచేవాడుకాదు. ఎంత మేము చెప్పి మొత్తుకున్నానూ. బుజ్జాయి కుంచకుండా చివరి బొట్టువరకు పిండి వెళ్ళిపోయేవాడు. ఎంతగోల పెట్టినా వినేవాడుకాదు.

మణి అని ఒక కుక్క ఉండేది. అది మా కుక్క కాకపోయినా మా దగ్గరకు వొస్తూ వుండేది. అది ఎప్పుడూ పల్లాకొత్తులో (మా ఇంటి ఎదురుగుండా వున్న ఒక వనం) పిల్లల్ని పెడుతూ వుండేది. అది ఎప్పుడు పిల్లల్ని పెట్టినా ఉడుములు తినేసేవి వాటిని. అది గర్భశోకంతో కుయ్యోమని ఏడుస్తూ వుండేది. ఒకసారి అట్లాగే దాని పిల్లలు చచ్చిపోయినాయి. అది వెల్లకితలా పడుకుని ఏడుస్తోంది. ఇంతలోకే బుజ్జాయి దానిదగ్గరికివెళ్ళింది. బుజ్జాయి మణితో ఆడుకుంటున్నట్టు ఆడుకుని దాని దగ్గిర పాలు తాగడం మొదలు పెట్టింది. మణికి ఎంత సంతోషమో! రోజూ బుజ్జాయి మణి దగ్గర పాలుతాగేది. మణి దానికి యిచ్చేది. మణి తన బాధనంతా మర్చిపోయింది.

కోనారువాళ్లు ఒక కుక్క పిల్లని తెచ్చుకున్నారు. ఆ కుక్క పిల్లపేరు లక్కీ. ఆ కుక్క పిల్ల, బుజ్జాయి ఆడుకునేవి. అదీ ఎరుపే, బుజ్జాయీ ఎరుపే. బుజ్జాయి కూడా చిన్న కుక్కపిల్ల అంత ఉండేది. దూడ ఏదో, కుక్క పిల్ల ఏదో తెలుసుకోవడం కష్టంగా ఉండేది. బుజ్జాయిని కాంపౌండ్ మధ్య ఉండే గడ్డిని మేయడానికి వదిలేవారు నర్తకీవాళ్ళు. ఒక రోజు ఈ లక్కీగాడు గడ్డిమేస్తున్న బుజ్జాయి తాడు నోట్లో పెట్టుకుని దాన్ని లాక్కెళ్ళి లక్ష్మి దగ్గర వదిలిపెట్టాడు. బుజ్జాయి తల్లిదగ్గర పాలన్నీ తాగేసింది. బుజ్జాయి ఇంట్లో ఒక చిన్నపిల్ల మాదిరిగానే మసులుతూ ఉండేది డాలీమాదిరిగానే. దానికిడాలీమంచం (చిత్రకూతురు) మీద దోమతెరలో దిండు మీద తల పెట్టుకుని పక్కమీద పడుకోవాలని మనసుగా వుండేది. డాలీ లేచిపోగానే వెళ్ళి ఆ పక్కమీద పడుకునేది. డాలీకూడా ఎర్రగానే ఉండేది. అందుకని ఆ దోమతెరలోంచి డాలీ పడుకున్నట్టే ఉండేది. చిత్ర డాలీ గవును అనుకుని వూరుకునేది. ఎంత సేపటికీ లేవకపోయేప్పటికి "ఏమిటి డాలీ, ఇంకా లేవవేం నువ్వు?" అనేది చిత్ర. ఇంతలో దోమతెరలోంచి తల బయటకి పెట్టి రెండు చెవులూ ఆడించుకుంటూ చిత్రవేపు తొంగి చూసేది బుజ్జాయి.

"ఓసి నీ దుంపతెగ, డాలీ అనుకున్నాను" అని తిట్టేది చిత్ర.

మధ్యాహ్నం అమ్మ చాప వేసుకుని పడుకుంటే పక్కనే వొచ్చి దిండు మీద తల పెట్టుకుని అమ్మపక్కనే పడుకునేది బుజ్జాయి. దానికి కోనారు పాలు వదిలేవాడు కాదుగనక అమ్మ జొన్నరొట్టెలు చేసి పెట్టేది దానికి. మేం కొద్దిమందిమే ఉండేవాళ్ళం గనక అప్పుడు, గుండ్రంగా కూచుని ప్లేట్లు పెట్టుకుని ఎవరికివాళ్ళం వడ్డించుకుని భోజనం చేసేవాళ్ళం. బుజ్జాయికి కూడా ఒక కంచం. అదికూడా మాతోపాటు తినేది. అసలు బుజ్జాయిని కట్టడమనేది లేదు. ఇల్లంతా ఇష్టమొచ్చినట్టు తిరిగేది. పొద్దున పూట 9గంటలకి నాన్న, నేను నిమ్మరసం తాగేవాళ్ళం. దానికి ఒక గ్లాసు నిమ్మరసం ఇవ్వవలసిందే. దానికి వేరే సత్తు గ్లాసులో ఇస్తే తాగేది కాదు



రమణాస్థానంలో చలం, సౌరిస్ భోజనం చేస్తున్నదృశ్యం

దానికి కూడా గాజుగ్లాసుతో పట్టించాల్సిందే. మేం ఏం తిన్నా దానికి పెట్టవలసిందే. హల్వాలు, కోవాలు, పరమాన్నం, అన్నీ తినేది. చివరకి ఇక్కడి కోనారువాళ్ళు దూడకిఅన్నంపెట్టకూడదు. జబ్బు చేస్తుంది అని చెప్పారు. అప్పటినించి దానికి కూళ్ళు (రాగిఅంబలి), జొన్నరొట్టెలుపెట్టే వాళ్ళం. ఇల్లంతా తిరుగుతున్నా, తోటలోకి వెళ్ళినా ఒక్క మొక్కముట్టుకునేది కాదు. ఒక అల్లరి చేసేది కాదు.

నాన్న అంటే చాలా ప్రేమ. మొట్ట మొదటి నించి బుజ్జాయి నాన్నకి బాగా అలవాటయి పోయింది. రోజుకి ఒక్కసారన్న నాన్నవచ్చిదాన్ని మెడగోకి ముద్దు చేయాలి. నాన్నతన పిల్లలాగా తన దూడ అయినట్టు వళ్ళంతా నాకి పెట్టేది. దాని నాలిక గరుకు, తోలువూడి వచ్చేట్టు నాకేది. నాన్న దగ్గరికి ఎవరిని రానిచ్చేది కాదు.

ఎవరైనా వచ్చి నాన్నతో మాట్లాడుతుంటే వెనకాల్నించి వచ్చి కుమ్మేసేది. నాన్న దాన్ని గోకి లేవబోతుండగా లుంగీ మీద గిట్టపెట్టేది కదలడానికి వీలులేకుండా. అప్పుడు నాన్న దాన్ని బతిమాలి "వెళ్ళమ్మా బుజ్జాయి" అని కొంతసేపు లాలిస్తే గిట్టతీసేది. దాన్ని కట్టేస్తే మెల్లిగా నాన్నని పిలిచి విప్పించుకునేది. అందుకని ఇంట్లో బయట స్వేచ్ఛగా తిరుగుతూ ఉండేది.

స్నానం అంటే దానికి ఇష్టంలేదు. స్నానం చేయించడానికి దాన్ని తీసుకువెళ్తుంటే నాన్న దగ్గరికి వెళ్ళి గోల చేసేది "నాకు స్నానం వద్దు" అని. ఇంక నాన్న బుజ్జాయి దగ్గరుండి దానికి ఎక్కువ రుద్దనివ్వకుండా చప్పచప్పన స్నానం చేయించి తీసుకొచ్చేవాడు.

ఒకసారి చే వచ్చింది బాంబేనించి చేకి జంతువులంటే చాలా ఇష్టమే. కానీ వాటి స్థానాల్లో అవి ఉండాలిగానీ ఇట్లా మనుష్యులతోపాటు సంచరిస్తూ ఉంటే తనకి అర్థం కాదు. అందరితోపాటు బుజ్జాయి బంతిలో కూచుని కంచంలో అన్నం తింటుంటే కోప్పడింది అందర్నీ. "ఏమిటి దీన్ని ఇట్లా వదిలేశారు? అందరితోపాటు దానికి కంచంలో అన్నం ఏమిటి? రేపు ఆవు అయినా ఇట్లాగే అందరితోపాటు తింటుందా? ఎందుకు ఇట్లాంటి అలవాటు చేశారు?" అని.

"ఏమిటి దీన్ని కట్టకుండా వదిలేశారు, మొక్కలవీ తింటుంది. కట్టేయండి" అని మందలించింది.

ఆ మర్నాటి నించి ఒక మొక్కని కూడా ముట్టుకోని బుజ్జాయి, మొక్కల్ని తినడం మొదలుపెట్టింది. ఒక రోజు కందులు ఆరబోసి ఉంటే అది వచ్చి తింటోంది. "దీన్ని కట్టేయకుండా వది

లేశారు. చూడండి. కందులన్నీతింటోంది" అని చే కేక వేసింది. అందుకని నర్సకి వాళ్ళు వచ్చి కట్టేశారు దాన్ని.

ఇంతలోకి తోటలో చే, నేను మాట్లాడుకుంటున్నాం.చే ఈజీ చెయిర్‌లో పడుకుంది. నేను పక్కన నుంచున్నాను. బుజ్జాయి నాన్నని బెల్లించి విప్పించుకున్నట్టుంది. పరిగెత్తుకుంటూ మా మధ్యకి వచ్చింది. వచ్చి చే మొహం దగ్గరికి తన మొహం పెట్టింది. ఆ కళ్ళల్లో ఎంత అల్లరో. దాని గెడ్డని కంతా కంది పప్పు అతుక్కుని వుంది. ముందు చేకి ఆశ్చర్యమేసినా తరువాత అర్థమయింది. నేను కందిపప్పు తింటోందని కేకలేశాను కనక అది విప్పించుకుని కంది పప్పంతా తిని నా దగ్గరికు వచ్చింది "చూశావా తిన్నాను. ఇప్పుడేమంటావు" అని నన్ను ఛాలెంజి చేస్తోంది. ఇన్నాళ్ళూ మీతోపాటుమనిషిగా మసులుతోంది నేను వచ్చి దాన్ని దూడ కింద ట్రీట్ చేసేప్పటికి "సరే. నేను దూడనయితే దూడచేసే అల్లర్లే చేస్తాను అని చేసింది" అంది చే.

ఒకసారి ఇంగ్లీషులో రాసిన లలితా సహస్రనామం వినిపిస్తున్నాడు నాన్న మా అందరికీ. కొంచెం సేపటికి మా పక్కన చూసేటప్పటికి బుజ్జాయి ఉంది. దానిలో చలనం లేదు. తల పైకెత్తి చూస్తోంది. దాని కళ్ళవెంట ధారలుగా నీళ్ళు. మేము అది అక్కడికి వచ్చిన సంగతే గమనించలేదు. ఎంత మూవ్ అయిపోయినా మో.

ఒకరోజు సాయంత్రం చీకటిపడ్డప్పుడు బుజ్జాయికనపడలేదు. నాన్న అన్నిచోట్లా వెతికాడు. ఎక్కడా కనపడలేదు. చివరికి ముందుగదిలో కనపడ్డది. అది భగవాన్ పటం ముందు బల్లమీద రెండు కాళ్ళూ పెట్టి నుంచునుంది. నాన్న 'బుజ్జాయీ' అని పిలిచినా పలకలేదు. దగ్గరికి వెళ్ళి చూసేటప్పటికి అది భగవాన్ మొహంవేపు చూస్తోంది. దాని కళ్ళవెంబడి ధారలుగా కన్నీళ్ళు.

సాధారణంగా జంతువులకి కోపం వస్తే ఆ క్షణమే పోతుంది. కానీ బుజ్జాయికి కోపంవస్తే రెండు మూడు రోజులు గుర్తుంచుకునేది. ఒక రోజు అది పాకలో కట్టేసి ఉండగా మాతోపాటు అన్నం పెట్టకుండా దానిముందు పళ్ళెంతో అన్నం

## ఈదేశంలో—ఎందుకు?

ఈ దేశంలో
ఎందుకు దీకొంటాయి పక్షులు
ఎగిరే విమానం రెక్కల్ని ?
ఆకాశందాకా ఊరేగే అవినీతిని
కూల్చేసే సత్తా
విమానాన్ని ఎగరేసే చేతుల్లో
విరిగిపోయిందని.

ఈ దేశంలో
ఎందుకు రాలుతుంటాయి ఇటుకలు
ఇప్పుడే పూర్తయిన ఇళ్ళనుంచి ?
ఆఫీసులో విడుదలైన సిమెంటు
డార్క్‌రూంలో దూరి
అడ్రసుతోపాటు తన
అవతారమూ మార్చేసిందని.

ఈ దేశంలో
ఎందుకు మోగుతుంటాయి సమ్మెలు
ఎత్తిన పిడికిళ్ళలోంచి ?
ఉన్న రెండుకళ్ళూ పాతేసుకుని
ఉన్నతాసనాలు తెగవల్లించే
అంతులేని మంత్రాలకు
చింతకాయలు రాలవని.

—డాక్టర్ సి. నారాయణరెడ్డి

తీసుకొచ్చి పెట్టాను. కోపంతో కుమ్మడాని కొచ్చింది. మూడు రోజుల వరకు నా దగ్గరికి రాలేదు. ఎవరైనా పని మనుషులు ఉన్నప్పుడు దానికి అన్నమైనా, రొట్టెయినా పెడితే తినేదికాదు. అప్పుడు ఈశ్వరుడు చెప్పారు. "వాడు బ్రాహ్మణుడు. అందరిముందు అన్నం పెట్టవద్దు" అని.పెద్దదయిపోతోందని బంతిలో కూచోనివ్వటం లేదు. అందరూ తిరిగే చోట తినేది కాదు. అందుకని పక్కనున్న గెస్టుహౌస్‌లో గదిలో ప్రత్యేకంగా నర్సకి భోజనం పెట్టేది. దీనికి బుజ్జాయి పాలుమానాక దాన్నికూడా ఆవులతోపాటు మేతకి బయటకి పంపించేవాళ్ళు. నాన్నని వదిలి మేతకి పోనని గోలచేసేది. నాన్న కొంచెం సేపు ముద్దుచేసి 'వెళ్ళమ్మా' అంటే అప్పుడు పరిగెత్తుకుంటూ పోయేది. ఇంక ఇంటికి తిరిగి రాగానే సాయంత్రం నాన్న దగ్గరికి వచ్చేది.ఎప్పుడయినా దీని అల్లరి భరించలేక ఆవుల కాపరి కొట్టాడో పరిగెత్తుకుంటూ నాన్న దగ్గరికి వచ్చి సౌంజ్ఞలతో ఆ దెబ్బలని చూపించుకునేవాడు కొట్టాడని.నాన్నవాడ్ని కోప్పడేవాడు. "ఈ మాటు దూడనికొట్టావంటే వూరుకో" నని. వాడు కొట్టలేదని దబాయించేవాడు. కానీ దాని వీపుమీద వాతలు కనపడేవి. వాడేమో నాన్న లేనప్పుడు దాన్ని కోప్పడేవాడు- "పోయి నా మీద అన్నీ అయ్యకి చెప్పుకుంటావా" అని.

పక్కింట్లో ఒక అయ్యర్ల కుటుంబం కాపరం ఉంది. వాళ్ళు ఆ తెల్లారగట్ట వూరికి పోతున్నారు. వాళ్ళ సామానంతా మోసిపెడతానని మాకు తెలియకుండా మాట్లాడుకున్నాడు రామస్వామి (గొడ్ల కాపరి). తెల్లవారే వాడు అటు పోగానే మా ఇంటి వరండా ముందు కట్టివున్న బుజ్జాయి 'బా. బా' అని అరవడంమొదలు పెట్టింది. దాని అరుపుకి అందరూ లేచి బయటికి వచ్చారు ఎందుకు అరుస్తోందా అని.

అది వాడి వేపు చూసి అరుస్తోంది. ముందు అర్థంగాక పోయినా తరువాత తెలిసింది. వాడు సామాను మోస్తున్నట్టు. తెల్లవారింతరువాత వాడ్ని బాగా చివాట్లు పెట్టారు. "ఆవుల దగ్గర కావలా ఉండకుండా ఎందుకు పోయావురా" అని. ఇంక వాడు రోజంతా సణుగుడు. "నేనేంచేసినా ఈ దూడ నా మీద సాడీలు చెబుతుంది" అని.

ఇంతలో బుజ్జాయికిపెద్ద జబ్బుచేసింది. జ్వరం. ఆయాసం. డాక్టరు దగ్గరికి వెళ్ళి చూపిస్తే నిమోనియా అన్నారు. బాగా జ్వరం ఉందిట.పాలు తప్ప ఏం తాగించకూడదన్నారు. దీనికి నిమోనియా గనక. తల్లి దగ్గర పాలు తాగించకూడదు. అందుకని ఓ పాలబుడ్డికొని పాలసీసాతో పట్టాలని చూశారు. ఆ రబ్బరు పీక వాసనకి మూతి చిట్లించి తాగనుపొమ్మంది. చివరికి ఎట్లాగో ఓలాగ దానిని తాగించే

వారు. ఆ డాక్టరు ముందర దీన్ని చూడగానే "దీన్ని చాలా గారాబం చేసినట్టున్నారు సాధారణంగా దూడలకి నిమోనియా రాదు" అన్నారట. రోజూ మందు తాగి వచ్చేది బుజ్జాయి. ఆస్పత్రి నించి పరిగెత్తుకుంటూ వచ్చి నాన్న వళ్ళో ముఖం దాచుకునేది.

"బుజ్జాయి, నీ చేత మందు తాగించారా? మందు ఎట్లా ఉంది." అని అడిగేవాడు నాన్న. నాన్న అడగగానే మూతి చిట్లించి చూపించేది. మందు అసహ్యంగా ఉందని రోజూ ఆస్పత్రికిపోనని మారాం పట్టేది నాన్న దగ్గర. "వెళ్ళాలమ్మా లేకపోతే నీకు జబ్బుఎట్లా నయమవుతుంది?" అని నాన్న బుజ్జగిస్తే అప్పుడు వెళ్ళేది. దానికి ఇంజక్షన్ ఇవ్వడానికి నలుగురు మనుషులుపట్టుకోబోయారటఆస్పత్రిలో. అప్పుడు రామస్వామి "మీరు పట్టుకోనక్ఖర్లేదు, అదే పడుకుంటుంది"అన్నాడు. "మరి పడుకోదేం?"అంటే "ఇది పరుపు మీద గానీ పడుకోదు" అని చెప్పాడట.

"అట్లాంటి అలవాట్లన్నీ చేశారు గనకనే దీనికి నిమోనియా వచ్చింది."అన్నారట డాక్టరు. ఆ రోజుకి ఎట్లాగో ఓలాగ పడుకోబెట్టాడు రామస్వామి. అదిఎవరూ పట్టుకోకుండానే కాలు చాపి ఇంజక్షన్ తీసుకుంది. తరువాత ఇంజక్షన్ ఇవ్వవలసినప్పుడు ఇంటినించే జంపకానా పట్టుకువెళ్ళేవాడు.బుజ్జాయి పడుకోవడానికి రామస్వామి నాన్న దూడకి టెంపరేచర్ ఎంత ఉందని చీటీ రాసి పంపించేవాడు డాక్టరుకి. డాక్టర్ టెంపరేచర్ నోట్‌చేసి పంపించేవాడు. ఆ టెంపరేచర్ చూసే గొడవపడేవాళ్ళం "అబ్బా ఎంత టెంపరేచర్ ఉందీ" అని. తరువాత సారంగపాణితో చెప్పారట డాక్టర్. "వాళ్ళు ఆదుర్దాపడతారని టెంపరేచర్ తక్కువ రాసి పంపించాను.ఆ దూడ ఒతుకుతుందనుకోలేదు నేను" అని.

దానికి చలిగా ఉందని ఓ కోటు కుట్టించారు. వరండాలో చలిగా ఉంటుందని గెస్టు హౌస్ గదిలో పెట్టారు దాన్ని. రోజూ నాన్నని అక్కడి నించి పిలిచేది రమ్మనమని అది రాలేదు గనక. నాన్న అక్కడికి వెళ్ళి చాలాసేపు కూచుని ముద్దు చేసి వచ్చేవాడు. ఆ గది అంతా ఇన్ఫెక్షన్ ఘాటుతో నిండి ఉండేదిట ఆ ఘాటుకి తల తిరిగిపోయేదిట. నాన్నకి. ఆ ఇన్ఫెక్షన్ తనకి కూడా అంటుతుందేమోనని తనకి ఓ మూల భయంగానే ఉండేది నాన్నకి. అయినా అది పిలవగానే రోజూ విడవకుండా వెళ్ళేవాడు.

ఆగస్టు 15 ఉత్సవం వచ్చింది. సాధారణంగా గెస్టు హౌస్‌లోనే దింపే వాళ్ళం. వచ్చిన అతిథుల్ని. కానీ ఈసారి ఎదురుగుండా ఉన్న సేవా (ఇప్పటి రమణ స్థాన్) లో దింపాం.

బుజ్జాయికి మెల్లిగా నయమైపోయింది. అది బతకడం డాక్టరుకే ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆవులకని ఒక చిన్న పాక ఉండేది మొట్టమొదట. ఆవుల సంఖ్య పెరిగినకొద్దీ షెడ్ వేయిద్దాం అనుకున్నారు. ఒక మంచి షెడ్డు తయారయింది. అమ్మ అంతా గృహప్రవేశానికి పూజలు చేసింది భగవాన్ ఫొటో పెట్టి, భగవాన్‌కి హారతి ఇవ్వబోతున్నారో, లేదో అందరికన్నా ముందు బుజ్జాయి ప్రవేశించింది ఆ షెడ్డులోకి తన సొంతం లాగ.

ఎంతో దర్జాగా తయారయింది బుజ్జాయి. దాని కంఠం చాలా గంభీరం. అది అంబా అన్నప్పుడు గొప్ప నాదం వినపడేది.

ఓ రోజు దాన్ని చూసి "ఎంత మంచి ఆవు అవుతోందో" అన్నాను.దాని కళ్ళం బడి నీళ్ళు.

"అననులే నిన్ను. ఆవు అననులే నిన్ను" అని బుజ్జగించేప్పటికి సమాధానపడింది.

ఇంతలో మేము డివోషన్ వదిలేసి సేవా (ఇప్పటి రమణస్థాన్)లోకి వచ్చేశాం. బుజ్జాయిని మేపడానికి తోలుకు వెళ్ళినప్పుడు,వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు ఒక దూకు దూకేది లోపలికి. నాన్నచేత ముద్దు చేయించుకుని చాలాసేపు, చప్పున లోపలికి పరుగెత్తి ఏ పప్పులో,వడియాలో ఆరబెట్టి ఉంటే వాటిని గబగబా తినేసేసి బయటకు వచ్చేది.

ఒక రోజు నర్తకివాళ్ళు దీన్నిఅంబోతు దగ్గరికి పంపించాలి అన్నారు. నేను ఆశ్చర్యపోయి చూస్తున్నాను. "ఇంత చిన్నదాన్ని అంబోతుదగ్గరికిపంపించడంఏమిటి? దీనికి పళ్ళురాలేదు కదా" అన్నాను. అప్పుడు బుజ్జాయి నోరుతెరచి పళ్ళమధ్య తొర్రి చూపించింది. అందరం ఎంత ఆశ్చర్యపోయినామో దాని తెలివి చూసి.

దూడని కన్న తరువాత ఆ దూడతో సహా నాన్న దగ్గరికి పరుగెత్తుకొచ్చేది. తల్లి అయిన తరువాత కూడా దాని అల్లర్లు మానలేదు. గబగబా ఇంటి వెనకకి వెళ్ళి ఆరబెట్టినవి యేముంటే వాటిని నోట్లో కుక్కుకుని బయటకి వచ్చేది.

బుజ్జాయి మూడోసారి కడుపుతో ఉండగా ఈ లోపున మేపేవాళ్ళు ఎందరో మారారు. ఏమయిందో హఠాత్తుగా జబ్బు చేసింది. పొట్ట ఉబ్బిపోయింది. డాక్టరుని పిలిచి చూపించారు. ఆ పొట్ట ఇంకా ఉబ్బరమే కానీ తగ్గలేదు. వాళ్ళు ఇచ్చిన మందులకి. దానికి జబ్బు ఎక్కువైపోయింది. నాన్న దాన్ని చూడడానికి గెస్టు హౌస్‌కి వెళ్ళాడు దాన్ని చూసి "బుజ్జాయి" అని పిలిచాడు దగ్గరికి వెళ్ళి. నాన్నవేపు చూస్తో మెడ వంచేసేసి రక్తం కక్కుకుని చచ్చిపోయింది. నర్తకి వాళ్ళ అనుమానం మేపేవాడు దాని పొట్టమీద కొట్టాడని. ●

